నా ఫోటో వేయకుండా పత్రికా ఎడిటర్స్ అంతా కోఆపరేటివ్ చేస్తున్నారు. ఇకమీదట కూడా అలాగే కంటిన్యూ అవుతుందని ఆశిస్తాను.

ఎప్పుడయినా మీరు అచ్చులో నా ఫోటో చూశారంటే నేను మర ణించానని అర్థం. లేదా బ్రతికున్న నన్ను 'చావరాదా' అన్న ఉద్దేశంతో దాన్ని ప్రచురించారని ఆ చర్యల ద్వారా అర్థం చేసుకుంటాను.

# పిచ్చే పడ్ గయె ఇన్‌కంటేక్స్

డబ్బు లేనివాళ్ళు ఆకలి అన్న పదానికి ఎలా భయపడతారో, డబ్బున్నవాళ్ళు అలాగే ఓ పదం వింటే వులిక్కిపడతారు. అది 'అజీర్తి లేదా కొలెస్ట్రాల్' అనుకుంటే పొరబాటే.

ఆ పదం ఇన్‌కంటేక్స్. ఓ సినిమా నిర్మాత నవ్వుతూ ఓసారి నన్నడిగాడు 'అసలైన టెర్రరిస్ట్ ఎవరో తెలుసా?' అని. నాకు తెలీదంటే 'ఇన్‌కంటేక్స్ ఆఫీసర్.... ఎక్కడయినా రాయండి' అన్నాడు.

డబ్బున్నవాళ్ళు ఇలా ఇన్‌కంటేక్స్ శాఖకి భయపడటానికి ప్రధాన కారణం టేక్స్‌ని ఇన్‌కంటేక్స్ చట్టప్రకారం కట్టకపోవడమే. ఓ ధనవంతుడు ఖర్చుచేసే ప్రతి ఖర్చు వెనక అతని స్వార్థం, ఆ ఖర్చు తాలూకు అనుభవం లేదా తృప్తి లభిస్తాయి. ఆఖరికి దానం ఇచ్చినా మానసిక తృప్తి లభిస్తుంది. లంచం యిచ్చినా పని జరుగుతుంది ఆ రెండు వృథా ఖర్చులయినా. కాని ఇన్‌కంటేక్స్ చెల్లిస్తే దానివల్ల కలిగే అనుభవం తాలుకు తృప్తి వుండదు. ఉన్నా తక్కువ కాబట్టి ఎవరికి వారు ఇన్‌కంటేక్స్ ఎగ్గొట్టాలని చూస్తుంటారు.

ఇన్‌కంటేక్స్ చెల్లింపుమీద చాలా జోకులు, వ్యాఖ్యానాలు వున్నాయి. ప్రభుత్వం నిర్వహించే సివిల్ సర్వీసెస్ పరీక్ష పాసవకుండా, జీతం తీసుకోకుండా ప్రభుత్వం కోసం పనిచేయడంట ఇన్‌కంటేక్స్ చెల్లించడమంటే. సంవత్సరం అంతా కష్టపడి పనిచేసి సంపాదించిన

దారిట్లో కొంత వాటాని ప్రభుత్వానికి చూస్తూ చూస్తూ వృధాగా చెల్లించడం అంటే అందరికీ సాధ్యంకాదు. దాంతో తమ సంపాదన రికార్డుల్లో ఎక్కడా దొరక్కుండా జాగ్రత్త పడతారు, దానిమీద టేక్స్ కట్టనవసరం లేదని. ఇన్‌కమ్‌టేక్స్‌లోని రెవిన్యూ యింటలిజెన్స్‌శాఖ, సర్వేశాఖ ఈ బ్లాక్‌మనీని కనిపెట్టడానికి సదా కృషి చేస్తుంటాయి.

అయితే అంతా టేక్స్ ఎగ్గొట్టడానికి ప్రయత్నించరు. 29 ఏళ్ళ అశ్వని ఖురానా అనే భారతీయ లాటరి వ్యాపారస్థుడు 1988-89 ఆర్థిక సంవత్సరానికి 2 కోట్ల రూపాయలు యిన్‌కంటేక్స్‌గా చెల్లించాడు. అతని సంపాదన 4 కోట్లు. అంటే సగానికి సగం టేక్స్‌గా చెల్లించాడన్నమాట. మనదేశంలో అంత టేక్స్ కట్టినవారు మరొకరు లేరు. ఇతని సంవత్సర టర్నోవర్ 300 కోట్లరూపాయలు. టాటా, బిర్లా కంపెనీలు కూడా అంత టేక్స్‌ని చెల్లించట్లేదు. ఓ పత్రికా విలేఖరి అశ్వనిని 'దొంగతనంగా అందరిలా టేక్స్ ఎందుకు ఎగ్గొట్టలేదని' అడిగితే అతని సమాధానం 'నాకు మానసిక ప్రశాంతత ముఖ్యం అనుకున్నాను. టేక్స్ చెల్లించగా మిగిలిన దాంతో సంతోషంగా వున్నప్పుడు అడ్డదారులు తొక్కి తలనొప్పి తెచ్చుకోవడం ఎందుకు?'

ఎంత చక్కటి ఫిలాసఫీ అనిపించకమానదు ఆ సమాధానం వింటే. నిజానికి యిన్‌కంటేక్స్ చెల్లింపు ద్వారా కలిగే తృప్తి ఓ అనుభవం కాదనుకునే వారికి అశ్వనీ ఖురానా సమాధానం కనువిప్పు కలిగిస్తుంది. లెక్కలన్నీ కరెక్ట్‌గా వుంటే యిన్‌కంటేక్స్ అధికారులకి భయపడాల్సిన అవసరం వుండదు. 'మనం చెల్లించే టేక్స్‌ని ప్రభుత్వం మన దేశాభివృద్ధికి వినియోగిస్తుంది కాబట్టి ఈ దేశం అభివృద్ధికి నేను కొంత చేస్తున్నాను' అన్న ఆలోచన కూడా ఆదాయపు పన్ను చెల్లింపుని ప్రోత్సహించవచ్చు.

గతంలో యిన్‌కంటేక్స్ నియమాలు మరీ దారుణంగా వుండేవి. ఓ సందర్భంలో అక్కినేని నాగేశ్వరరావుగారు నాతో మాట్లాడుతూ 'మేం సంపాదించిన ప్రతి వందరూపాయల్లో తొంభై రూపాయలు టేక్స్ కట్టేవాళ్ళం. పదే మాకు మిగిలేది' అన్నారు. అలాంటప్పుడు నిజంగా

మనం నూటికి వది చొప్పున జీతం తీసుకుని ప్రభుత్వం అనే కేపిటలిస్ట్ కోసం పనిచేసే జీతగాళ్ళం అనిపించకమానదు. ఆదాయాన్ని ఎలా కప్పిపుచ్చాలా అని ఆలోచిస్తాం. కాని వి. పి. సింగ్ ఆర్థికమంత్రిగా వుండగా ఆదాయపు రేటుని తగ్గించాడు. మరీ గతంలో అంతదారుణంగా లేదిప్పుడు. ఆదాయం పెరిగితే ప్రతి వందలో ఏభై రూపాయలు ప్రభుత్వానికి టేక్స్‌గా చెల్లించాల్సి వుంటుందిప్పుడు.

ఉద్యోగస్థులకి ఐ. టి. వేటు తప్పదు. వాళ్ళ జీతం సంవత్సరానికి ఐ. టి. ఆదాయ పరిమితి అయిన 28 వేల రూపాయలు దాటితే, జీతంలోంచే యిన్‌కంటేక్స్ కట్ చేసేస్తారు. ఎటొచ్చీ వ్యాపారస్థులు, ప్రొఫెషనల్స్. ఆదాయాన్ని దాచే ప్రయత్నం చేసేది.

మనదేశంలో ఆదాయం పెరిగేకొద్దీ చెల్లించాల్సిన టేక్స్ రేటు కూడా పెరుగుతుంది. ప్రభుత్వం కేపిటలిజానికి వ్యతిరేకంగా ఈ ఏర్పాటుచేసి వుంటుందనిపించకమానదు. అదే అమెరికాలో ఆదాయం పెరిగేకొద్దీ చెల్లించాల్సిన టేక్స్ తగ్గుతూ వస్తుంది. ఇందువల్ల ప్రతీవ్యక్తి కష్టించి పనిచేసి హయ్యర్ స్లేబ్‌లోకి వెళ్ళి టేక్స్‌ని తగ్గించుకోవాలని ప్రయత్నిస్తాడు. మనదేశంలోలా లాభం తగ్గించి చూపకుండా పెంచి చూపడానికి ప్రయత్నం చేస్తారు. ప్రోగ్రెస్‌కి ఈ పద్ధతి మంచిదని నా అభిప్రాయం.

అమెరికాలో ఓ బిల్డర్‌ని పరిచయం చేస్తూ టి.వి.లో యిలా చెప్పారు. 'ఇతను లో-కాస్ట్ యిళ్ళని కట్టి మిడిల్ ఇన్‌కం కుటుంబాలకి అమ్మి దానిమీద హైయిర్ ఇన్‌కం సంపాదిస్తూంటాడు.' గుడ్ కోట్.

టేక్స్‌రూల్స్ ప్రతి దేశంలో ఆర్థికంగానే కాకుండా సోషల్ కండిషన్స్‌ని బట్టి కూడా మారుస్తూండాలి. ఇందుకు చక్కని వుదాహరణ పోలండ్. 1958 లో పోలండ్ దేశం పెళ్ళికాని ఆడవాళ్ళ ఆదాయంమీద విధించే యిరవై శాతం సూపర్ టేక్స్‌ని తీసేసింది. ఎందుకంటే పోలండ్‌లోని 10 లక్షల మంది అమ్మాయిలు అబ్బాయిలకన్నా అధికంగా వున్నారని జనాభాలెక్కల సర్వేలో తేలడంవల్ల. కాని బ్రహ్మచారులకి సూపర్ టేక్స్‌లో ఈ రాయితీని

యివ్వలేదు ప్రభుత్వం. ఎందుకంటే ఆడవాళ్ళకి వరుళ్ళు లభ్యంకాక వివాహం కాలేదు కాని చేసుకోకూడదనికాదు. కాని మగవాళ్ళు బ్రహ్మచారులుగా వుండటానికి కారణం వాళ్ళ ఛాయిస్ బట్టి కాని అమ్మాయిలు దొరక్కకాదు. బ్రహ్మచారులు టేక్స్ సేవింగ్స్ కోసం ఆ తర్వాత వివాహాలు చేసుకోసాగారు. మనదేశంలో కుటుంబ నియంత్రణకి యిలాంటి రాయితీలు యివ్వొచ్చు. అసలు పిల్లల్లేని దంపతులకి టేక్స్‌లో అధిక రాయితీనివ్వొచ్చు. ఎక్కువ మంది పిల్లలున్నవారికి ఎక్కువ టేక్స్‌ని విధించి అధిక సంతానాన్ని ఆ విధంగా కూడా నిరోధించడానికి ప్రయత్నించవచ్చు.

ప్రపంచంలో ప్రతి ఆరుగురిలో ఒకరు భారతీయులని మొన్నటి జనాభాలెక్కల్లో తేలింది. కాని ఎన్నివేలమంది భారతీయుల్లో ఒకరు యిన్‌కంటేక్స్ చెల్లిస్తున్నారో లెక్క తేలుస్తే, మనదేశంలో ఎంతమంది నిర్భాగ్యులున్నారో అర్థం చేసుకోవచ్చు. కనీసం ఏభై లక్షల మందయినా వుండరు మనదేశంలో యిన్‌కంటేక్స్ చెల్లించేవారు.

నిజానికి టేక్స్‌ని సిన్సియర్‌గా ప్రజలు కట్టడానికి ఇన్‌కంటేక్స్ ఓ పద్ధతిని ప్రవేశపెట్టొచ్చు. తమ జీవితకాలంలో ప్రతి చెల్లింపుదారుడు చెల్లించే టేక్స్‌లో కొంతభాగం, అతనిలో సంపాదించే శక్తిపోయాక తిరిగి యిచ్చే పద్ధతి ప్రవేశపెడితే, అలాంటి దైన్య పరిస్థితి వస్తే తాము చెల్లించిన టేక్స్ తమని అవసరానికి ఆదుకుంటుందని సిన్సియర్‌గా పే చేసే అవకాశం వుంది. సినీనటి సావిత్రి తనకెరీర్‌లో వెలిగిపోతున్న రోజుల్లో చాలా టేక్స్ చెల్లించింది. చివర్లో ఆదాయంలేక అనారోగ్యం పాలయినప్పుడు ఇన్‌కంటేక్స్ శాఖకి రాసిందట, తను టేక్స్ రూపంలో చాలా చెల్లించానని, తను బ్రతడానికి నెలకో వెయ్యిరూపాయలు ఇప్పించమని. అందుకు బదులుగా 'మా నియమాలు అందుకు వప్పుకోవు' అని సమాధానం వచ్చిందట. అంటే ఇండైరెక్ట్‌గా 'నువు చచ్చినా ఫర్వాలేదు' అన్న సౌండ్ వున్నట్టేగా? ఇన్‌కంటేక్స్ ఏక్ట్‌లోకి కొంత మానవత్వం తీసుకువస్తే ఫలితం బావుంటుందని నా అభిప్రాయం. ఆ కారణంగానే యిన్‌కంటేక్స్ శాఖని మోసంచేసి కూడబెట్టాలను

కుంటారు ఎంత సంపాదించినా.

తరచు పేపర్లో సినిమా నటీనటులు బకాయిపడ్డ ఇన్‌కంటేక్స్ మొత్తాల వివరాలు ఇస్తూంటారు. రాజ్‌కపూర్. ఎన్. టి. రామారావు పేర్లు ఆ జాబితాలో తప్పనిసరిగా వుండేవి. జయప్రద 25 లక్షల 82 వేల రూపాయలు ఐ. టి. డిపార్ట్‌మెంట్‌కి బాకీ వుందిట. ఇది వడ్డీ, పెనాల్టి కాక. ఇంగ్లీష్‌లో ఓ సామెత వుంది. నువ్వు డబ్బున్న వాడివన్న సంగతి ఒకోసారి నీకు యిన్‌కంటేక్స్ డిపార్ట్‌మెంట్ చెప్తేకాని తెలీదు!

ఇన్‌కంటేక్స్ అంటే అన్ని దేశాల ప్రజలకి కోపమే. బ్రిటన్‌లో, అమెరికాలో 'ఇన్‌కంటేక్స్ వాళ్ళని ఎలా ముప్పతిప్పలు పెట్టాలి' అన్న అంశంమీద హ్యూమరస్ పుస్తకాలు కొన్ని వచ్చాయి. అందులో యిచ్చిన కొన్ని పద్ధతులు. (1) నీ యిన్‌కంటేక్స్ డిపార్ట్‌మెంట్‌కి వుత్తరం రాస్తూ ఏక్ట్‌లోని ఫలానా రూల్ ప్రకారం నాకు రిఫండ్ రావాలనీ (నిజానికి ఆ రూల్ నంబరు మీరు కల్పించిందే) వారు మీకు రాయని లెటర్ నంబర్ వుదహరిస్తూ వుత్తరం రాసో, లేదా మీరు రాయని వుత్తరానికి సమాధానం పంపమనో, లేదా చిన్న మొత్తానికి చెక్‌పంపుతూ ఏ రూల్ ప్రకారం మీరు ఆ సొమ్ము కట్టమని ఫలానా లెటర్‌లో (లెటర్ నంబర్ మీరు వూహించి రాసిందే) అడిగారో బదులు రాయమని లెటర్ రాయడంద్వారా. వీటిపల్ల యిన్‌కంటేక్స్ స్టాఫ్ సమయం వాటికి సమాధానం రాయడంతో వృథా అయి చాలా ముఖ్యమయిన పని పెండింగ్‌లో వుండిపోతుందిట. ఇలాంటి పుస్తకాల్లో ఒకటి 'బ్యూరోక్రాట్స్, హౌటు ఎన్నాయ్‌దెమ్'. దీని వెల 2 పౌండ్ల 80 పెన్నీలు.

హత్యచేసి పోలీసులు ఎప్పుడు పట్టుకోవడానికి వస్తారా అని బెదరడంలాంటిదే ఆదాయం దాచి టేక్స్ తక్కువ చెల్లించి ఎప్పుడు మనం వాళ్ళ చేతుల్లో పడతామా అని మనశ్శాంతి కోల్పోవడం.